క్లుప్తంగా

యల్సన్‌పల్లిలో ఎద్దుల బండ్ల పోటీలు



దామరగిద్ద: మండలంలోని యల్సన్‌పల్లిలో ఉగాది పర్వదినం సందర్భంగా శనివారం ఎద్దుల బండ్ల బిర్రు లాగుడు పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో నిలిచిన నారాయణపేటకు చెందిన రైతు మల్లేష్‌కు 5 తులాల వెండి, రెండో బహుమతి లోకాయపల్లికి చెందిన జుర్రు రవిశేఖర్ గెలుచుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పుట్టి ఈదప్ప, కాంగ్రెస్ నాయకులు పరిపూర్ణం, మాణిక్యప్ప, బస్వరాజ్, నిర్వాహకులు రవి, నారాయణ, తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీరువా వితరణ

మరికల్: మండల కేంద్రంలోని సరస్వతి ఆలయానికి శనివారం దాత కురుమూర్తి బీరువా వితరణగా అందించారు. ఆలయంలో వస్తువులు, ఇతర సామగ్రిని భద్రపర్చడం కోసం ప్రత్యేకంగా తయారు చేసిన బీరువాను ఆయన ఆలయ నిర్వాహకులకు అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో దుబాయ్ రాములు, శివప్రసాద్, జైపాల్‌రెడ్డి, రాజు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



నర్వ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం తెల్లవారుజామున నర్వ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ కురుమయ్య అందించిన వివరాల మేరకు.. పెద్దకడ్మూర్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు చిట్యాల్ నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు కోరగా.. చూపించకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. చిట్యాల్‌కు చెందిన డ్రైవర్ పుల్లరి మారుతిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశామని తెలిపారు. అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

చిన్నారులకు అభినందన



నారాయణపేట రూరల్: పట్టణంలోని అబాకస్ కేంద్రంలో శిక్షణ పొంది అంతర్జాతీయ పోటీల్లో రాణించిన ఇద్దరు విద్యార్థులను ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అభినందించారు. ఆరేళ్ల వయస్సులో సంజయ్, సావి లు అబాకస్లో లక్ష వరకు టేబుల్స్‌ను ఎలాంటి పెన్ను, కాగితం లేకుండానే గడగడ చెప్పగలరు. ఇటీవల దీనిపై జరిగిన ప్రపంచ స్థాయి పోటీల్లో ఇరువురు 4, 6వ ర్యాంకులను సాధించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇరువురు చిన్నారులను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని అభినందించారు. చిన్నతనంలో ఇంతటి ప్రతిభ కలిగి ఉండడం అద్భుతమని, భవిష్యత్తులో మరింత రాణించాలని సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



దామరగిద్ద: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లోకుర్తి గ్రామంలో నిర్వహించిన లోకుర్తి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడా నిర్వాహకులు సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మూడెకరాల భూమి ఇవ్వాలి

అయిజ: అంతర్జాతీయ భూమిలేని వ్యవసాయ కూలీల పోరాటదినం సందర్భంగా శనివారం వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సభ్యులు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కార్యదర్శి లావణ్య మాట్లాడారు. భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం 3 ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు.

ముందస్తు ఉగాది సంబరాలు



నారాయణపేటలో పచ్చడి తాగుతున్న విద్యార్థులు



మద్దూరు బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

సాక్షి, నెట్‌వర్క్: విశ్వావసునామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో శనివారం ముందస్తు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఉగాది పండుగ ప్రత్యేకతను చిన్నారులకు వివరించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు పచ్చడి పంపిణీ చేసి అన్ని రుచులు సమ్మేళనంగా జీవితంలో సకల కళలను ప్రదర్శించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

- కోస్గి మండలంలోని ముశ్రీఫా ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శేఖరయ్య ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తకుండలో షడ్రుచులతో పచ్చడి తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులకు పచ్చడిని పంచిపెట్టారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, బాలకృష్ణ, పుల్లప్ప, శశిధర్, శ్రీదేవి, పుష్పలత, జ్యోతి తదితరులు ఉన్నారు.
- నారాయణపేట పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు విద్యార్థులకు పచ్చడి పంచి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేష్‌కుమార్, సాయిలీల, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.
- కృష్ణా మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు షడ్రుచుల పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- మాగనూర్ మండలంలోని వడ్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ప్రధానోపాధ్యాయుడు గురురాజారావు ఉగాది విశిష్టతను వివరించారు. విద్యార్థులు ఉగాది గురించి కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భీమ్‌రెడ్డి, అమ్మన్న, శ్రీనివాసురావు, రవీందర్‌రెడ్డి, గోపాల్, రాజేశ్వరి, నరేందర్ పాల్గొన్నారు.
- ధన్వాడ మండల కేంద్రంలోని శ్రీచైతన్య విద్యామందిర్ పాఠశాలలో విద్యార్థులకు ఉగాది పండుగ విశిష్టత గురించి పంచగం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు కాశయ్య, ఆచార్య, భారత్, రఘు, రవి, సరిత, దీపిక, అనసూయ తదితరులు పాల్గొన్నారు.
- మద్దూరులోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు.



వడ్వాట్ పాఠశాలలో ..



ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో..



ముశ్రీఫా పాఠశాలలో..

‘ఎన్నికల హామీలు నెరవేర్చాలి’



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా.. పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయడంలో జాప్యం చేస్తుందని, బకాయిలో ఉన్న డీఏ లను ప్రకటించి పీఆర్సీని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన టీఎస్‌యూటీఎఫ్ నారాయణపేట జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు రావాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మరొక ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మాజీ కోశాధికారి కిష్టయ్య మాట్లాడుతూ.. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని కోరారు. అదే విధంగా పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించి పాఠశాలల పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివరాములు, వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, జిల్లా కోశాధికారి భీమయ్య, జిల్లా కార్యదర్శులు రవికుమార్, సాయప్ప, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆభరణాల శోభాయాత్ర



అమ్మవారి ఆభరణాల శోభయాత్రలో పాల్గొన్న భక్తులు

ఊట్కూరు: ఊట్కూరులో శ్రీశ్రీ కాళికా మాత ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ఆభరణాల శోభయాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరి ఆలయం నుంచి ఆభరణాలను పల్లకీలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ఆభరణాలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి మల్లప్ప, సత్యనారాయణ, మల్లేష్, జయదేవ్, నర్సింహులు, వడ్ల మోనప్ప, గంగాధర్, ఆచారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పండగొస్తే.. పల్లెకు రాని ‘ఆర్టీసీ’



శనివారం మధ్యాహ్నం బస్సుల కోసం గంటల తరబడి బస్టాండ్‌లో ఎదురుచూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

- హైదరాబాద్‌కు వెళ్తున్న పల్లె వెలుగులు
- బస్సులు రాక విద్యార్థులకు తప్పని తిప్పలు

నారాయణపేట రూరల్: దేవుడు కరుణించిన పూజారి వరమివ్వలేదు అన్న చందంగా పాఠశాల విద్యార్థుల పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత, రాయితీ పాసులు అందించి, అందుకు సంబంధించిన రియింబర్స్‌మెంట్ డబ్బులను ఆర్టీసీ ఖాతాలో జమ చేస్తుంటారు. అయితే స్థానిక ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పండగలు వచ్చాయంటే పల్లె వెలుగు బస్సులను గ్రామాలకు తిప్పకుండా హైదరాబాద్ వైపు మళ్లిస్తుంటారు. దీంతో విద్యార్థులు బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. డబ్బులు లేని పేద, మధ్యతరగతి విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరు కావడం పరిపాటిగా మారింది. ఎన్నోసార్లు విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రాలు అందించినా, ఆందోళన చేసినా ఆర్టీసీ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పల్లె వెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి డబ్బులు అధికంగా లాగుతున్నారు. దీనికి తోడు రోజువారి బస్సులు సైతం విద్యార్థుల సమయానికి నడిపించకపోవడంతో విద్యాసంస్థలకు ఆలస్యంగా వెళ్తున్నారు. శనివారం సైతం జిల్లా కేంద్రంలోని చుట్టుపక్కల గ్రామాలకు బస్సులను రద్దుచేసి హైదరాబాద్‌కు పంపించారు. ఎంజీబీఎస్ నుంచి వందలాది సిటీ బస్సులను జిల్లాలకు తరలించేందుకు ఏర్పాటు చేసినప్పటికీ.. స్థానిక డిపో ఆదాయాన్ని పెంచుకునే ఆలోచనతో విద్యార్థులను ఇబ్బందుల గురి చేస్తూ ఆయా సర్వీసులను దారి మళ్లించి హైదరాబాద్‌కు నడిపించడం విమర్శలకు తావిస్తోంది. ఏది ఏమైనా విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులను ఇబ్బందుల గురి చేయడంపై విచారణ జరిపి సంబంధిత ఆర్టీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా అమావాస్య పూజలు



స్వామివారికి హారతి ఇస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: కాళబెళగుండె బసవేశ్వర స్వామి ఆలయంలో శనివారం అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర నియమావళి, శాశ్వత రుద్రాభిషేకం, మహా మంగళ హారతి, అలంకరణ చేపట్టి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా పట్టణంలోని యాద్గిర్ రోడ్లో గల అయ్యప్పస్వామి ఆలయం, శివలింగేశ్వర స్వామి ఆలయం, మండలంలోని జలాల్పూర్ కర్రెప్ప స్వామి ఆలయాల్లో అన్నదానం చేశారు.

నర్వ: అమావాస్య సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్వ శివాలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, పల్లకీసేవ, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

బాలబ్రహ్మేశ్వర ఆలయంలో..

పెద్దకడ్మూర్ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో 41 రోజుల మండల పూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్వికులు రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ధ్వజస్తంభ, గణపతి, కుమారస్వామి, పార్వతిదేవి, నవగ్రహ, జంటనాగుల దేవతామూర్తుల విగ్రహాల ఆహ్వాన యజ్ఞం, బాలబ్రహ్మేశ్వర స్వామికి మహాన్యాస రుద్రాభిషేకం, తీర్థప్రసాదాల వితరణతో పాటు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను చేపట్టారు.

హక్కులపై అవగాహన అవసరం



చట్టాలపై అవగహన కల్పిస్తున్న పోలీసులు

మాగనూర్: మండల కేంద్రంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సివిల్ రైటర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రతి నెల చివరి రోజున గ్రామంలో ప్రజలకు ఉండే హక్కుల గురించి వివరించారు. సమాజంలో ఎలాంటి మూఢనమ్మకాలు లేకుండా కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ సమానమే అని, ప్రభుత్వ ఆస్తులు అందరికీ సమానంగా వర్తిస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజల హక్కుల గురించి ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఉన్న ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, హెడ్ కానిస్టేబుల్ ఉమేష్‌గౌడ్, పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

మాగనూర్: వడ్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్భయ చట్టం, పోక్సో చట్టం గురించి అవగహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యులు బాలరాజ్, చెన్నయ్య మాట్లాడుతూ.., ఆడపిల్లలపై జరిగే అఘాయిత్యాలు, అత్యాచారాల ఘటనలపై ఎదుర్కోవాల్సిన సమస్యలు, బాలకార్మిక చట్టం, మూఢనమ్మకాలు, సైబర్ క్రైమ్, బాల్యవివాహాల చట్టాల గురించి వివరించారు. ముఖ్యంగా బాలికలకు ఎదైనా సమస్య ఎదురైతే వెంటనే షీటీం వారికి ఫోన్‌ద్వారా సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించుకొని ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకొచ్చే విధంగా ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురురాజారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రావణం కట్టవద్ద పారిశుద్ధ్య పనులు



అమరచింత: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న పంచాంగ శ్రావణ కట్ట ఆవరణంలో శనివారం పారిశుద్ధ్య పనులను మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని ప్రతి సంవత్సరం పండుగ రోజు సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం పురోహితుడు పంచాంగ శ్రావణం చేయడం ఆనవాయితీ. ఈ సంవత్సరం సైతం పంచాంగ శ్రావణానికి వస్తున్న ప్రజలకు సౌకర్యాలను కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య పనులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ రవిబాబు తెలిపారు.

సోదరభావంతో మెలగాలి



ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్ద మస్‌జీద్ వద్ద నమాజ్ అనంతరం ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అందరూ సోదరభావంతో మెలగాలని, పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధూజ, ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డి, సింగాల్ విండో అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి, రాజు, రహిమన్‌ఖాన్, ఖయ్యూమ్, రఘువేందర్‌గౌడ్, లక్ష్మయ్య, రాంచంద్రి, బాబా, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

జేఐహెచ్ ఆధ్వర్యంలో..

ఊట్కూర్: రంజాన్, ఉగాది పర్వదినాల సందర్భంగా జమాతే ఇస్లామిక్ హింద్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం గ్రామ పెద్దలకు ఇఫ్తార్ గిఫ్ట్‌లను అందించారు. ఈ సందర్భంగా జేఐహెచ్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ ఇబాదుర్ రహిమాన్ మాట్లాడుతూ రంజాన్, ఉగాది పర్వదినాలు కలిసి రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో శక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, అనిల్‌కుమార్, జేఐహెచ్ నాయకులు జావిద్, ఇబాదుర్ రహిమాన్, మడికి మహమ్మద్, నవాజ్, సైఫుల్లా తదితరు పాల్గొన్నారు.

బాల కవి సమ్మేళనం

కొత్తపల్లి: మండలంలోని భూనీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉగాది పండుగను పురస్కరించుకొని శనివారం బాల కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో వివిధ తరగతుల వారీగా విద్యార్థులు పోటీపడి కవితలు చెప్పి అందరిని ఆకర్షించారు. ఉగాది యొక్క ప్రాముఖ్యత, ప్రశస్తిని కవితల ద్వారా తెలియజేయడంతో పాఠశాలలో పండుగ వాతావరణం ఏర్పడింది. అనంతరం షడ్రుచులచే తయారు చేసిన ఉగాది పచ్చడిని తాగారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థి నవనీతకు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్న కేశవరెడ్డి, ఉపాధ్యాయులు వరలక్ష్మి, భానుప్రకాశ్‌రెడ్డి, శివాజీ, రాణిబాయి, అహ్మద్‌అలి, నర్సింలు, కవిత, నరేష్, శ్రీనివాసులు, సీఆర్పీ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.15 వేల నష్ట పరిహారం ఇవ్వాలి

మరికల్: యాసంగిలో ఎండిన వరి పంటలకు ఎకరాకు రూ. 15 వేల నష్ట పరిహారం ప్రభుత్వం ఇవ్వాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు బసంత్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతయ్య డిమాండ్ చేశారు అన్నారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ యాసంగిలో సాగు చేసిన వరి, ఇతర పంటలు నీళ్ల లేక కళ్ల ఎదుటే ఎడుతుంటే రైతుల కష్టాలను ప్రభుత్వం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. మండలంలో 35 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా.. సాగు నీరు లేక వేలాది ఎకరాలు ఎండిపోయిందని వాపోయారు. ఎండిన పంటలను రైతులు పశువులకు వదిలేసి ఆర్థికంగా చితికిపోయారన్నారు. పంట నష్టంపై ప్రభుత్వం సర్వే చేపట్టి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు.

జైసంవిధాన్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఏఐసీసీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పట్టణ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ కొ త్వాల్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఏఐసీసీ అధ్యక్షుడిగా ఎన్నికై వందేళ్ల పూర్తయిందని, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతుందన్నారు. అంబేద్కర్ పట్ల పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచితంగా మాట్లాడారన్నారు. అమిత్‌షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీతో పాటు దేశ ప్రజలందరూ డిమాండ్ చేశారని, కాని ఆయన చే యలేదన్నారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్ సిద్ధాంతాలు, రాజ్యాంగ విలువలను కాపాడాలనే ఉద్దేశంతో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వచ్చేనెల 2 నుంచి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం రెండు గ్రామాలు, సాయంత్రం రెండు గ్రామాలు పాదయాత్ర చేపట్టి మహాత్మాగాంధీ, అంబేద్కర్ సిద్ధాంతాలు, రాజ్యాంగ విలువలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ఇన్‌చార్జి శ్రీకాంత్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్, జహీర్ అఖ్తర్, సిరాజ్‌ఖాద్రీ, సాయిబా బా, మధుసూదన్‌రెడ్డి, అజ్మత్‌అలీ పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఉత్సవాలకు సిద్ధమైన వీరప్పయ్యస్వామి దేవాలయం

దేవరకద్ర: దేవరకద్రలో వందల ఏళ్ల చరిత్ర ఉన్న శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాల పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం నుంచి కలశాల ప్రతిష్ఠాపన, నాగదేవత, నవగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దేవాలయాల గోపురాలను పూర్తిగా తొలగించి పునర్నిర్మాణం పూర్తి చేశారు. దేవాలయ ప్రాంగణంలో పాలరాతి శిలలను వేసి అందంగా ముస్తాబు చేశారు. దేవాలయ ఆవరణమంతా సీసీ పనులు పూర్తి చేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు.

- ఆదివారం కలశాల శోభాయాత్ర, యాగశాల ప్రవేశం, గోపూజ, గణపతిపూజ, గౌరిపూజ, శాంతి మంత్ర పారాయణం, కలశపూజ, నవగ్రహ అష్టదిక్పాలక, విగ్రహ జలాధివాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
- సోమవారం దేవత విశేష పూజ, మృత్యుంజయ హోమం, పీఠ సంస్కరం, పరమపూజ్య 108 రేవణ సిద్ధ చరంతేశ్వర శివాచార్య మహాస్వామిచేతుల మీదుగా యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాప్రతిష్ఠ, నేత్రోన్మీలనం, బలిహారం, జయాదిహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.
- ఏప్రిల్ 1న మంగళవారం రుద్రపారాయణం, గిరిజాకల్యాణం మహా మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.